# సాయీ అంటే ఓయీ అని పలికే



**సాయిలేనిదెక్కడ! సర్వాంతర్యామి సాయి! ఒక్క షిర్డీలో ఉన్నాడా? ఎక్కడెక్కడో ఉన్నాడు! లెక్కకు మించిన సాయి మందిరాలున్నాయ్! లెక్కలకందని సాయిభక్తులున్నారు!! ప్రాక్పశ్చిమ దేశాల్లో సాయి మందిరం లేని పట్టణం లేదు! బషీర్‌బాబా నాలో సాయిభక్తిని నెలకొల్పాడు. ఆ వాసానికి 'శ్రీవేంకటసాయి నిలయం' అని పేరుపెట్టుకున్నాను. సాయీ అంటే చాలు ఓయీ అని పలుకుతాడు! ప్రపంచంలోని 47 దేశాల్లో సాయీ మందిరాలున్నాయ్! ఇంకా ఎన్ని ఉన్నాయో ఎవరి కెరుక! సబ్‌కా మాలిక్ ఏక్‌హై! అందరి దేవుడూ ఒకడే!!**

సాయినాథుడు... ఆచరణే బోధనగా అవతరించిన అవధూత! వందేళ్ళ క్రితం ఈ నేలమీద నడిచాడు. ఈ గాలిని శ్వాసించాడు. తన చుట్టూ ఉన్న మనుషులకు మంచిని బోధించాడు. మానవతను మేల్కొలిపాడు. సాయితత్వంలోని ప్రేమతత్వాన్ని ప్రపంచానికంతా పంచారు. దసరా పర్వదినం నుంచీ ఏడాది పాటు... శిరిడీ సాయిబాబా మహాసమాధి మహోత్సవాలు (1918–2018) ఘనంగా జరుగనున్నాయి. 'సమర్థ సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై' నినాదాలు మిన్నంటనున్నాయి.

**'మీ పేరు?'**

**'అందరూ సాయిబాబా అంటారు'**

**'తల్లితండ్రులూ'**

**'సాయిబాబాయే'**

**'వయసు'**

**'లక్షల సంవత్సరాలు'**

...మామూలు ప్రశ్నలే కాని మేధకు అందని సమాధానాలు. ఉపనిషత్తులు, తేటతెల్లం చేసిన అనంతత్వ ప్రతీకకు మాత్రమే ఇది సాధ్యమని తాత్త్వికుల విశ్లేషణ. మూడున్నర మూరల భౌతిక దేహం ఆ ప్రతీకకు కేవలం ఓ వాహిక అది-నీళ్ళతో దీపాల్ని వెలిగించింది. పెనుతుపాను తాకిడికి అడ్డు నిలిచింది. మరెక్కడో మంటల్లో పడబోతున్న శిశువును కట్టెదుట ధునిలో చేయిచాచి కరుణతో కాపాడింది. అపారమైన దయామృతాన్ని వర్షిస్తూ ఏడు సముద్రాలకు ఆవలనున్న భక్తుల్ని... పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లుగా తన సన్నిధికి రప్పించుకుంది. ఇష్ట దైవాల్ని తనలోనే దర్శింపచేసింది. గీతా శ్లోకానికి సరికొత్త భాష్యం చెప్పింది. ఉపవాసాలనూ, మంత్రోపదేశాలనూ, శరీరాన్ని రాచిరంపాన పెట్టే కఠోర దీక్షలను కాదని... 'శ్రద్ధ – సబూరి' అనే రెండు పైసల్ని మాత్రమే అడిగింది. వాటిని నికరమైన ప్రేమతో నిష్కళంకమైన భక్తితో సమర్పించిన పరిపూర్ణ హృదయాల్ని అక్కున చేర్చుకొని 'అల్లా భలాకరేగా' అంటూ అనంత విభూది జల్లులు వర్షించింది. మంచిని బోధించింది. మనుషులు మార్చి, మానవతను రక్షించింది. ఈ ప్రతీకకు సంప్రదాయాల సంకెళ్ళు లేవు. కాలపరిమితులూ, కట్టుబాట్లూ లేవు. దేహమే తానని భ్రమించే వారి సందేహాలను పటాపంచలు చేస్తూ, సమాధి నుంచి కూడా సకల కార్యాలనూ నిర్వర్తిస్తానని అభయమిచ్చింది. మనిషి తన సౌకర్యం కోసం ఏర్పరచుకొన్న కాలమానం ప్రకారం రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ మహాసమాధికి ఇది శతాబ్ది నూరేళ్ల క్రితం మానవాళి చర్మచక్షువుల ముందు నడయాడిన సాయి దివ్య స్మృతుల్లోకి వెళ్తే.

## ఆధ్యాత్మిక నివేదన

సుమారు 1858లో జరిగిందా సంఘటన. ఓ మునిమాపు వేళ... శిరిడీ గ్రామ పొలిమేరల్లో ఎడ్ల మెడలోని గంటలు చప్పుడు వినిపించింది. ధూప్ ఖేడా గ్రామం నుంచి గూడుబళ్ళు నాటుతోవలో బారులుతీరి వస్తున్నాయి. వాటిలో మగపెళ్ళివారున్నారు. ధూప్‌ఖేడా మోతుబరి చాంద్‌పాటిల్‌గారి బావమరిది కుమారుడికి శిరిడీ అమ్మాయినిస్తున్నారు. పొరుగూరు నుంచి వచ్చే మగ పెళ్ళివారు పొలిమేరలో విడిదిచేస్తే, ఆడపెళ్లివారు ఎదుర్కోలు పలకడం సంప్రదాయం. అందువల్ల శిరిడీ పొలిమేరలోని ఖండోబా ఆలయం దగ్గర ఆలయపూజారి మహాల్సాపతి గారి పొలంలో చెట్టు కింద గూడుబళ్ళు ఆగాయి. ఒక్కో బండిలోంచి పెళ్ళివారు దిగారు. అన్నిటికన్నా చివరనున్న బండిలోని ఓ ఆజానుబాహువు దిగాడు. పందొమ్మిది ఇరవయేళ్లుంటాయి. పచ్చని దేహకాంతి. తేనె రంగులో మెరిసే కనుపాపలు. తలకు గుడ్డ చుట్టుకొని, నిండైన కఫ్నీ ధరించి, చేతిలో శటకాతో దిగిన యువ ఫకీరుల ఖండోబా ఆలయం వైపు కదిలాడు.

నిశ్శబ్ద పరిసరాల్లో ఒక్కసారిగా అలికిడి...ఆలయపూజారి మహాల్సాపతి ఆధ్యాత్మలో ఉన్నట్టుండి అలజడి... గుడి బయటకు వచ్చి లాంతరు పైకెత్తి చూశారాయన. గట్టు తెగిన సముద్రంలా హృదయం ఉప్పొంగింది. పలచని వెలుగులో... కదిలే కలువల కొలనులా వస్తున్న యువఫకీరును చూస్తూనే 'యా సాయీ' (మరాఠీలో 'రండి ప్రభూ') అని పిలిచాడు. తన భక్తుడిచేత అలా పిలుపించుకునే క్షణం కోసం యువఫకీరు ఎదురుచూస్తున్నాడేమో! అంతవరకూ అలా పేరుపెట్టి ఎవరూ పిలువలేదు. ఆయన పేరేమిటో కూడా ఎవరికీ తెలియదు. ధూప్‌ఖేడా మోతబరి చాంద్‌పాటిల్‌కు సైతం ఆ యువఫకీరుతో పరిచయం విచిత్రంగా జరిగింది. కొన్నాళ్ల క్రితం చాంద్ బాయ్ గుర్రం తప్పిపోయింది. దాని కోసం ఆయన ఊళ్లు గాలిస్తూ వెళ్తుంటే, దార్లో ఓ చెట్టు కింద కనిపించిన యువఫకీరు గుర్రపు జాడను చెప్పాడు. గుర్రం ఆచూకీని కనుగొన్న చాంద్‌పాటిల్ యువఫకీరులోని కళాకాంతుల్ని చూసి విస్మయం చెందాడు. ఊరూ, పేరూ అడిగాడు. నవ్వి ఊరుకున్న ఫకీరు... అక్కడికక్కడ నీటిని సృష్టించి, చాంద్‌పాటిల్ చేత చిలుం తాగించారు. అతడి ప్రార్థన మేరకు ధూప్‌ఖేడాకు వెళ్లి చాంద్‌పాటిల్ ఇంట్లో కొన్నాళ్ళపాటు అతిథిగా ఉన్నాడు.

తనకు పేరు పెట్టేందుకు శిరిడీలో ఓ భక్తుడు హృదయం నిరీక్షిస్తోంది యువఫకీరుకు తెలుసుకాబోలు. పెళ్లివారితో కలిసి శిరడీ బయల్దేరాడు. చందమామ నేలమీద వాలినట్లు ఖండోబా గుడి ముందు బండి దిగి భక్తుడైన మహాల్సాపతికి కనువిందు చేశాడు. ఆ క్షణంలో వెలువడ్డ 'సాయీ' అన్న పిలుపు శిరిడీ చరిత్రను మలుపుతిప్పింది. అక్కడ ధూళి కణం చందనమై పరిమళించింది. ఈ ప్రపంచానికి 'సాయిబాబా'ను పరిచయం చేసింది. ఆయనను చూసిన శిరిడీ గ్రామవాసులు కొన్ని ఉదంతాల్ని గుర్తు చేసుకొన్నారు. యువఫకీరు పదహారేళ్ల బాలుడిగా ఉన్నప్పుడు గ్రామం చివర్లో వేపచెట్టు కింద శీతోష్ణాల్ని లెక్క చెయ్యకుండా తపస్సు చేశాడని చెప్పారు. ఓ దివ్యజ్ఞాని మరిన్ని విశేషాల్ని వెలుగులోకి తీసుకొచ్చాడు. వేపచెట్టు కింద భూగృహంలో ఆ బాలుగు నాలుగో ఏట నుంచీ యోగసాధనలు చేస్తున్నాడని వెల్లడించాడు. అక్కడ పలుగూ పాలతో తవ్వి చూస్తూ భూగృహం అనవాళ్ళు కనిపించాయి. అపుడు పదహారేళ్ల బాలుడు. తన గురువుగారి సమాధి అందులో ఉందనీ, గురుస్థానాన్ని గుప్తంగా ఉంచమనీ కోరడంతో జనం దాన్ని మూయించి వేశారు. పదహారేళ్ళ ఫకీరు మూడేళ్ళపాటు అక్కడే తపస్సు చేసి, మధ్యలో కొన్నాళ్లపాటు దేశాటన చేసి, తిరిగి పెళ్ళివారితో తన గమ్యానికి చేరుకొన్నాడు. సమాధి చెందేవరకూ శిరిడీలోనే ఉన్నాడు. తన సమాధి నుంచే భక్తుల కోరికలు తీరుస్తున్నాడు. ●

## పదకొండు అభయసూత్రాలు...

- ▲ నా శిరిడీ ప్రవేశం సకల దుఃఖపరిహారం
- ▲ ఆర్తులైనా నిరుపేదలైనా ఈ ద్వారకలో ప్రవేశించేందుకు అందరూ అర్హులే
- ▲ నా ఈ భౌతిక దేహాన్ని చాలించిన తర్వాత కూడా నేను అప్రమత్తంగానే ఉంటాను.
- ▲ నా సమాధి నుండే భక్తుల్ని రక్షిస్తాను
- ▲ నా సమాధి నుంచే సకల కార్యాలూ నిర్వహిస్తాను
- ▲ నా సమాధి మాట్లాడుతుంది
- ▲ నన్ను ఆశ్రయించినవారినీ, శరణన్న వారిని నిరంతరం రక్షించడమే నా కర్తవ్యం.
- ▲ నాపై దృష్టి నిలిపినవారిని నేను కటాక్షిస్తాను
- ▲ మీ భారాన్నా నాపై వేయండి. నేను భరిస్తాను.
- ▲ నా సలహాను, సహాయాన్నీ కోరినవారికి తక్షణమే నేను అందజేస్తాను.
- ▲ నా భక్తుల గృహాల్లో అన్న వస్త్రాలకు ఏ లోటూ ఉండదు. 'లేమి' అన్న మాటకు చోటే ఉండదు.



## జపనీయ సాయి

**ఎక్కడి షిరిడీ, ఎక్కడి జపాన్? సాయిబాబా ఏనాడు ఆ దేశంలో అడుగుపెట్ట లేదు. అయినా జపాన్‌లోని టోక్యోలో సాయిబాబాకు ఒక గుడి కట్టారు. ఎవరో ప్రవాస భారతీయులు నిర్మించి ఉంటారని అనుకుంటున్నారా? కాదు... కియోతకా, కాకో... అనే ఇద్దరు జపనీయులు భక్తిపూర్వకంగా నిర్మించిన ఆలయం ఇది. వీరిద్దరూ ఓసారి భారత్ వచ్చారు. అనుకోకుండా సాయిబాబాను దర్శించుకున్నారు. అప్పట్నించీ పరమభక్తులుగా మారిపోయారు. జపాన్ తిరిగి వెళ్లాక... బాబాకు గుడి కట్టారు. రోజూ సాయిని 108 నామాలతో స్తుతిస్తారు. అభిషేకాలూ చేస్తారు. సాయిబాబా విగ్రహం ముందు నిత్యం వెలిగే ధుని ఏర్పాటు చేశారు. మహాసమాధి ఉత్సవాలు ఘనంగా జరుపనున్నారు.**



## ప్రతిరూప సాయి

**పుణెలోని సాయి క్షేత్రాన్ని షిరిడీ ఆలయంగానే నిర్మించారు. పుణేకు దగ్గర్లోని కివాలే ప్రాంతంలో ఉన్న ఈ ఆలయాన్ని 'ప్రతి షిరిడీ సాయి ఆలయం' అని పిలుస్తారు. పచ్చని చెట్ల మధ్య నయన మనోహరంగా ఉంటుంది. లోపలికి అడుగుపెట్టగానే.. షిరిడీలో ఉన్నట్లే అనిపిస్తుంది. చుట్టూ పెద్ద ఉద్యానవనం ఉంటుంది. మూడంతస్తుల్లో ఉండే ఈ ఆలయం రాజమందిరాన్ని తలపిస్తుంది. నిర్మాణ కౌశలమూ అద్భుతమే. ఆలయంలో పెద్ద 'ధుని' కూడా ఉంది.**